# కొత్త బంగారు లోకం

జి. అరుణ

కన్నీళ్లు తుడుచుకుంటూ ఇంట్లోకి వచ్చింది సుధ. ఆడుకోవడానికి బయటకి వెళ్లి అవమానానికి గురై ఏడుస్తూ తిరిగి రావడం సుధకు అలవాటైంది. ఇరుగుపొరుగు పిల్లలతోపాటు తోడబుట్టిన అక్క, అన్నయ్యలు కూడా తనను గేలి చేయడమే ఆ అమ్మాయి దుఃఖానికి కారణం.

ఉయ్యాల బల్లమీద ఎక్కి కూర్చుని రెండు మోకాళ్ల మధ్య ముఖం దాచుకుంది. సుధ నిశ్శబ్దంగా రోదిస్తోందని ఆమె శరీర కదలికలే చెబుతున్నాయి.

"ఏమైంది తల్లీ? ఎందుకేడుస్తున్నావు?" పెరట్లో మొక్కలకు నీళ్లు పెట్టి చేతులు తుడుచుకుంటూ వచ్చిన రంగనాథం అనునయంగా అడిగాడు. తాతయ్య మాటలకు చిన్నగా తలెత్తింది సుధ. ఆయన ప్రశ్నకు జవాబివ్వకుండా మౌనంగా ఉండిపోయింది.

ఉయ్యాల బల్లమీద సుధ పక్కన కూర్చున్నాడు రంగనాథం. భుజంమీద ఉన్న కండువాతో మనవరాలి కన్నీరు తుడిచాడు. తనవంక ప్రేమగా చూస్తున్న తాతయ్యతో తన మనసులోని బాధను చెప్పుకోవాలనిపించింది సుధకు.

"నాకు నత్తి అని అందరూ ఎగతాళి చేస్తున్నారు తాతయ్యా" అతికష్టంమీద ఏడుపును ఆపుకుంటూ అంది సుధ.

సుధకు చిన్నప్పుడు మాటలు చాలా ఆలస్యంగా వచ్చాయి. ఉచ్ఛారణలో స్పష్టత ఉండదు. వాక్యం మొదలుపెట్టేటప్పుడు గొంతు పెగలదు. పదాలకోసం తడుముకోవాల్సి వస్తుంది.

బాల్యం నుండి సుధను ఈ సమస్య వెంటాడి వేధిస్తోంది. చదువులో మరీ వెనుకబడిలేదు. అలాగని మంచి మార్కులురావు. ప్రతి సబ్జెక్టులోనూ ఒక మోస్తరుగా మార్కులు వస్తాయి.

సాలోచనగా మనవరాలివైపు చూసారు రంగనాథం.

గవర్నమెంట్ ఆఫీసులో రికార్డు అసిస్టెంటుగా ఉద్యోగంచేసి ఈమధ్యనే రిటైరయ్యారాయన. భార్య చనిపోయి చాలాకాలమైంది. ప్రస్తుతం తన ఖాళీ సమయాన్ని ఎలా గడపాలో తెలియక వారం క్రితమే కొడుకు దగ్గరకు వచ్చాడు. వచ్చినప్పటి నుంచీ సుధను గమనిస్తూనే ఉన్నాడాయన.

ఇంట్లో వున్నంతసేపూ సుధను అక్క, అన్నయ్యలు గేలి చేసి ఏడిపిస్తూనే వుంటారు. తండ్రి ఎదుట బుద్ధిగా ఉన్నా ఆయన బయటకెళ్లగానే ఏదో ఒక వంకతో సుధను మాట్లాడించి ఆ అమ్మాయి సమాధానం చెప్పలేక సతమతమవుతుంటే వాళ్లిద్దరూ నవ్వుతూ హేళన చేయడం వారి నిత్యకృత్యమైంది.మనవరాలి సమస్య గురించి రెండు రోజుల క్రితం కోడలు శ్యామలతో ప్రస్తావించాడు.

"డాక్టర్ వద్దకు తీసుకెళ్లమని మీ అబ్బాయితో చాలాసార్లు చెప్పాను. కొన్నాళ్లు ఆగితే అదే తగ్గిపోతుందని తేలిగ్గా కొట్టి పారేస్తున్నారు"

సుధను వేధిస్తున్న బాధ అంత తేలిగ్గా కొట్టి పారేసే విషయం కాదని, కాస్త సీరియస్‌గానే తీసుకోవాలని ఆయనకు అర్థమైంది. ఇంట్లోనే సుధ పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే స్కూల్లో మరెన్ని అవమానాలకు గురవుతోందో తేలిగ్గానే ఊహించాడాయన. జాలిగా సుధవైపు చూసారాయన.

"బంగారుతల్లీ! ఇలా రామ్మా" అంటూ ఆప్యాయంగా పిలిచారాయన.

ఆ అమ్మాయి కళ్లల్లో చిరునవ్వు తొంగి చూసింది. అప్పుడప్పుడు తల్లి తనను అలా పిలుస్తుంటే కొండెక్కినంత సంబరంగా అనిపిస్తుంది. అమ్మ తరువాత ఇప్పుడు తాతయ్య తనను మళ్లీ ఆప్యాయంగా పిలుస్తున్నాడు.

"నీ బాధ నాకు బాగా అర్థమైంది. ఈ సమస్య నుండి నీకు బయటపడాలని అనిపిస్తోందా?" అని అడిగాడు.

"అవును తాతయ్యా! చక్కగా మాట్లాడాలని నా ఆశ. నేను మాట్లాడుతుంటే అందరూ వినాలని నా కోరిక" తడబడుతూ అక్షరాలు కూడబలుక్కుని నెమ్మదిగా చెప్పింది సుధ.

"వెరీ గుడ్... నీ కోరిక తప్పకుండా తీరుతుంది. నేను బయటకు వెళ్తున్నాను. బజారు నుండి ఏమైనా తీసుకురావాలా" కోడల్ని అడిగారు.

"ఏమీ అవసరంలేదు మామయ్యా" అంది కోడలు శ్యామల.

గంట తరువాత ఇంటికి వచ్చాడు రంగనాథం. ఆయన ముఖంలో సంతోషం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

రాత్రి భోజనాలు అయిపోయాక మనవరాలి గురించి కొడుకుతో మాట్లాడాడు.

"అదే తగ్గిపోతుంది నాన్నా. పిల్లల్లో కొందరికి నత్తి ఉండడం సహజం. వయస్సు పెరిగేకొద్దీ అదే తగ్గి పోతుంది. కొన్నాళ్లు చూసి తగ్గకపోతే డాక్టర్ దగ్గరకు తీసుకువెళదాం" అన్నాడు కొడుకు.

ముగ్గురు పిల్లలున్న మధ్య తరగతి కుటుంబంలో ఓ బిడ్డకు నత్తి సమస్య గురించి స్పీచ్ థెరపిస్ట్‌ను కలిసేందుకు వెంటనే సుముఖత వ్యక్తం చేయని తండ్రి మనస్తత్వం అది.

సుధను ఈ సమస్య మానసికంగా కృంగదీసి మరింత బలహీనురాల్ని చేస్తోంది. ఆ బాధ నుండి బయటపడాలన్న పట్టుదల ఉన్నా మార్గం తెలియక సతమతమవుతోంది. మనం సరైన దారి చూపితేనే ముందుకు వెళుతుంది. తానేం చేయదలచుకున్నదీ కొడుకు కోడలికి వివరంగా చెప్పాడు రంగనాథం.

"అలాగే కానీయండి. మీ నమ్మకం నిజం

కావాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాం.'' అంది శ్యామల.

హోమ్‌వర్క్ చేసుకుంటున్న సుధను డాబా మీదకు తీసుకువెళ్లి కొద్దిసేపు మాట్లాడాడు. తాతయ్యా మాటలకు సంతోషంగా తలూపింది సుధ.

***

మర్నాడు తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు తాతయ్యా తట్టి లేపడంతో బలవంతంగా కళ్లు తెరిచింది సుధ.

"ఏమిటి తాతయ్యా?'' అంది బద్ధకంగా.


"ఇక లే తల్లీ''

"కొంచెంసేపు పడుకుంటాను తాతయ్యా''

"ఊహూ... టైమ్ సరిపోదు. ఇకనుంచి రోజూ ఈ టైమ్‌కు లేవడం అలవాటు చేసుకోవాలి'' రాగి చెంబులో నుండి గ్లాసులోకి నీళ్లు వంచి సుధకు అందించాడు.

తెల్లవారుఝామున తాతయ్యతో కలసి నడిచి వెళుతుంటే సుధకు ప్రశాంతంగా ఆహ్లాదంగా అనిపించింది. పదినిముషాలపాటు నడిచిన తరువాత వాళ్లిద్దరూ కాలనీలోని ఒక భవంతిలోకి వెళ్లారు.

యాభై రెండేళ్ల వ్యక్తి ముందు గదిలో కూర్చుని ఉన్నాడు. ఆయన సంస్కృతం కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారని తాతయ్య చెప్పాడు. ఆయన పేరు పినాకపాణి.



తాతయ్యతోపాటు సుధ కూడా ఆయనకు చేతులు జోడించి నమస్కరించింది.

ఆయన కొద్దిసేపు సుధతో మాట్లాడారు. ఆయన ప్రశ్నలకు జవాబు చెప్పడానికి సుధ చాలా కష్టపడాల్సి వచ్చింది. స్పష్టంగా మాట్లాడలేని తన అశక్తతకు కళ్లవెంట నీళ్లు తిరిగాయి.

"బాధల్ని రుచి చూపించే భగవంతుడు మధురమైన ఫలాలను కూడా మనకోసం సిద్ధంగా ఉంచుతాడు. ప్రతి సమస్యకూ పరిష్కారం తప్పకుండా ఉంటుంది. ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థాయికి ఎదగాలన్న పట్టుదల, శ్రమపడే ఓపిక, నిరంతరం సాధన ఉంటే నువ్వు త్వరలోనే ఈ బాధ నుండి బయటపడగలవు."

టేబుల్ మీద ఉన్న మూక పంచశతి గ్రంథాన్ని తీసుకుని సుధకు చూపించారాయన.

"పుట్టుకతో మూగవాడైన ఓ వ్యక్తి కామాక్షి అమ్మవారిని సేవించి ఆరాధించాడు. మహిమాన్వితమైన అయిదువందల శ్లోకాలు అతని నోటి నుండి వెలువడ్డాయి. జగన్మాత దయతో మూగతనం నుండి విముక్తుడయ్యాడు. మూకః (మూగవాడు) అని అప్పటివరకూ గేలి చేసిన వారందరూ అతని మూగతనం తొలగిపోవడంతో నిశ్చేష్టులయ్యారు. మూక పంచశతిలోని శ్లోకాలను ప్రాతఃకాలంలో శ్రద్ధాభక్తులతో పఠించి మూగతనం నుండి, నత్తి నుండి విముక్తి పొందినవారెందరో ఉన్నారు. ఈ సంస్కృత శ్లోకాల్లోని అక్షరాల విన్యాస పరుసలో అంతటి శక్తి దాగి ఉంది. మంత్రశక్తితో కూడిన ఈ శ్లోకాలను పఠించడంవల్ల చక్కటి వాగ్ధాటి కలుగుతుంది. ఇప్పుడు చెప్పు... నువ్వు కూడా నేర్చుకుంటావా?"

ఆయన మాటలకు సుధ ఆనందంగా తలూపింది. ఆరాధనాపూర్వకంగా పుస్తకంవైపుచూసింది.

"ఆర్యాశతకము, పాదారవింద శతకము, స్తుతి శతకము, కటాక్ష శతకము, మందస్మిత శతకము... అ అయిదు శతకాలు ఇందులో వున్నాయి. ఒక్కొక్కదానిలో వంద శ్లోకాలు ఉంటాయి..." గ్రంథం గురించి మరికొన్ని వివరాలు చెప్పారాయన.

కొద్ది నిముషాల్లో బోధన ప్రారంభమైంది. విఘ్నేశ్వరుడిని స్తుతించి సంస్కృత భాషలోని కొన్ని సరళమైన శ్లోకాలను వినిపించి సుధ చేత పలికించారు. ఉచ్చరించడానికి తడబడుతూ బిడియంగా ఆగిపోయిన సుధకు ధైర్యం చెప్పి చిరునవ్వుతో ప్రోత్సహించారు.

సుధ అపశబ్దం పలికినా భయంతో కొన్నిసార్లు గొంతు పెగలక బేలగా చూసినా ఆయన కళ్లతోనే ప్రోత్సహించి బోధన కొనసాగించారు.

"ఇప్పుడు పాఠంలోకి వద్దాం" మూక పంచశతి గ్రంథాన్ని ఆమెకు అందించాడు.

పుస్తకం వైపు చూడకుండానే సుస్వరంతో మాస్టారు శ్లోకాలను వినిపిస్తుంటే విశాలమైన కళ్లతో ఆయనవైపు చూసి తెలుగు లిపితోవున్న పుస్తకంలోకి దృష్టి సారించింది. దాదాపు గంటసేపు శిక్షణ సాగింది.

"ఈవేళ్టికి చాలిద్దామా?"

మాస్టారు మాటలకు తలూపి లేచింది.

వాకింగ్ ముగించుకుని గేటు బయట ఎదురు చూస్తున్న తాతయ్య వద్దకు వచ్చింది.

ఇద్దరూ కలసి ఇంటివైపు నడిచారు.

రెండుమూడురోజుల్లోనే బిడియం తొలగిపోయింది. తడబడకుండా శ్లోకాలను నెమ్మదిగా చదివే ప్రయత్నం చేయసాగింది సుధ.

మొక్కుబడిగా నేర్పించి ఊరుకోకుండా ప్రతి శ్లోకానికి సరళమైన తెలుగు భాషలో అర్థం వివరించసాగారు మాస్టారు.

భాషలోని మాధుర్యానికి, ఆయన గొంతులోని స్పష్టత తోడై మాస్టారు ఎంతసేపు మాట్లాడినా వినాలనిపిస్తోందేగానీ విసుగనిపించడంలేదు సుధకు.

తాను కూడా అంత మధురంగా మాట్లాడగలగాలి అనుకుంది మనసులో దృఢంగా.

మాస్టారి పుణ్యమా అని తెలుగు, సంస్కృతం భాషలమీద ఆ చిన్నారికి మక్కువ ఏర్పడింది.


క్రమక్రమంగా ఈ రెండు భాషలమీద తనకు తెలియకుండానే ఇష్టం పెరిగింది.

మనసులో ఇన్నాళ్లు తిష్ఠ వేసుకుని కూర్చున్న అయోమయం, గందరగోళం, భయం తొలగిపోయాయి. ఆలోచనల్లో స్పష్టత ఏర్పడింది. తాను ఏ విద్యార్హత సాధించాలో మనసులోనే నిర్ణయించుకుంది. ఆ విధంగా ఓ శుభ పరిణామానికి ఆమె మనసులో అంకురార్పణ జరిగింది. అది మొదలు



## మంచి పాత్ర

మణిరత్నం 'రావణ' సినిమాలో అభిషేక్-ఐశ్వర్యలు జంటగా నటిస్తుంటే విలన్‌గా తమిళ హీరో 'విక్రమ్' నటిస్తున్నాడు. ఇది రామాయణం ఆధారంగా నిర్మిస్తున్న సంగతి ఇప్పటికే ప్రచారంలో వుంది. అందుకనే కాబోలు తన పాత్ర సీత కాదంటోంది ఐశ్వర్య. 'ఇందులో నేను ధరిస్తున్న కారెక్టర్ సీత తరహా పాత్ర కాదు. సీతలోని సుగుణాలు నా పాత్రలో వుంటాయి తప్పితే మొత్తానికి సీత పాత్ర కాదు' అని ప్రత్యేకంగా చెబుతోంది.



మరింత శ్రద్ధగా సాధన చేయసాగింది.

***

రోజులు గడుస్తున్నాయి.

ఇప్పుడు నిర్భయంగా ఎలాంటి తడబాటు లేకుండా శ్లోకాలు చదవగలుగుతోంది. సుధ కళ్లల్లో ఆత్మవిశ్వాసం ప్రస్ఫుటంగా కనబడుతోంది.

మాట తీరులో చక్కటి మార్పు రావడం తెలుస్తూనే వుంది. సరైన ఉచ్చారణతో తడబడకుండా మాట్లాడడం అలవడింది. ఇంట్లో వారితో ముచ్చటించేటప్పుడు, స్కూలులోని విద్యార్థులతో సంభాషించేటప్పుడు, టీచర్లతో మాట్లాడేటప్పుడు రవ్వంత అయినా నత్తి దరి చేరకుండా సులువుగా మాట్లాడడం అలవాటైంది. అసందర్భ సంభాషణలు చేయకుండా ఎప్పుడు ఎంతవరకు మాట్లాడాలో కూడా అలవడింది. జాలి చూపులు, గేలి మాటలు లేవిప్పుడు.

అమ్మ కళ్లల్లో సంతోషం, నాన్న ముఖంలో చిరునవ్వు, తాతయ్య చూపుల్లో మెచ్చుకోలు, అక్క, అన్నయ్యలు ఆశ్చర్యంతో కూడిన భావం కనిపించి సుధ మనసు సంబరపడింది. సాధన చేయడంవల్ల ఎలాంటి అసాధ్యమైనా సుసాధ్యమవుతుందని స్వానుభవంతో అర్థమైంది.

పాఠ్య పుస్తకాల మీద శ్రద్ధ పెరిగి పట్టుదలతో చదవడం అలవరచుకుంది. మంచి మార్కులు పొందడంలో ఉన్న థ్రిల్ ఏమిటో సుధకు తెలిసింది.

***

ఆరునెలలు గడిచాయి. మూక పంచశతిలోని శ్లోకాలను అలవోకగా, వినసొంపుగా చదివే స్థాయికి ఎదిగింది సుధ. విశుద్ధి చక్రంలోని దోషాన్ని పోగొట్టి మధురమైన కంఠస్వరాన్ని అనుగ్రహించిన జగన్మాత మీద ఆరాధనభావం, అందుకు దారి చూపించిన మాస్టారుమీద భాషకు అందని కృతజ్ఞతాభావం కలిగాయి. వెన్నంటి ముందుకు నడిపించిన తాతయ్య మీద వున్న ఇష్టం పదింతలు పెరిగింది.తన నుంచి పరాయైన నత్తిని తలచుకుని నిశ్శబ్దంగా నవ్వుకుంటోంది సుధ.

అంతర్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పట్టణం మొత్తం మీద ప్రథమ స్థానంలో నిలిచింది సుధ. మెరుస్తున్న కళ్లతో తాను గెలుచుకున్న బహుమతిని అపురూపంగా తీసుకొచ్చి మాస్టారుకి చూపించింది. సుధ ఆనందంలో తానూ పాలుపంచుకున్నారు పినాకపాణి మాస్టారు.

"ఈరోజు నీవు సాధించిన ఈ గెలుపు రేపు పెద్ద విజయాలను సాధించిపెడుతుంది. నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది'' అన్నారు మన స్ఫూర్తిగా శిష్యురాలిని ఆశీర్వదిస్తూ.

తాను గెలిచిన బహుమతి కంటే మాస్టారు మాటలు సుధకు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చాయి.

***

సుధకు ఇప్పుడు ఇరవై రెండేళ్ల వయస్సు. కఠినమైన తన సాధనతో కొత్త బంగారులోకం సృష్టించుకుంది ఆమె.

ఓ ప్రముఖ వార్తా ఛానెల్‌లో న్యూస్ రీడర్‌గా ఎంపికై వార్తలు చదువుతూ వీక్షకులను అలరిస్తోంది. చక్కటి కనుముక్కు తీరులో, దోషాలు లేకుండా చక్కటి స్పష్టమైన ఉచ్చారణతో చలాకీగా వార్తలు చదివే సుధ అంటే ఇప్పుడు అందరికీ ఎంతో క్రేజ. టీవీ ప్రేక్షకులు ఆమెను ఎంతగానో అభిమానిస్తారు. ఆకాశవాణిలో కూడా న్యూస్ రీడర్‌గా పని చేస్తూ శ్రోతలకు వార్తలు వినిపిస్తోందామె. ఎఫ్‌ఎమ్ రేడియోలో ఆర్‌జెగా సేవలందిస్తూ మధురమైన మాటలతో అన్ని వర్గాలవారిని ఆకట్టుకుంటోంది. వార్తలు చదవడంతోపాటు రేడియో జాకీగా పని చేయడాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్న సుధ ఇష్టంగాచేసే పని మరొకటి ఉంది.

నగరంలో జరిగిన తెలుగు సాహితీ సదస్సుకు వ్యాఖ్యాతగా వ్యవహరించే అవకాశం వచ్చింది సుధకు. తనకు లభించిన ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందరి ప్రశంసలను అందుకుంది సుధ.

ప్రస్తుతం ఎమ్ఏ చదివి సంస్కృత సాహిత్యంలో పరిశోధన చేస్తోందామె. పినాకపాణి మాస్టారి అండదండలు, ఆశీస్సులతో పరిశోధన చురుగ్గా సాగుతోంది. సాధనతో తన కలలను సాకారం చేసుకుంటోంది సుధ.

★

## అతి ఖరీదైన దుస్తులు

1573-1643 మధ్య ఫ్రాన్స్ మహారాణి ధరించిన దుస్తులే ఇంతవరకూ ప్రపంచంలో అతి ఖరీదైనవి. ఆ దుస్తుల్లో 39 వేల ముత్యాలు, 3 వేల వజ్రాలని కలిపి కుట్టారుట. ఇప్పుడు దాని ఖరీదు 150 కోట్లు వుంటుంది. అయితే తన జీవితంలో ఒకే ఒక్కసారి ఆ దుస్తుల్ని తన కొడుకు అక్షరాభ్యాసం నాడు కట్టుకుందిట.

## ఐదు ఆదివారాల ఫిబ్రవరి

ఫిబ్రవరికి అసలే రోజులు తక్కువ. అందులో 5 ఆదివారాలు వస్తే పని చేసే రోజులెన్ని? గత శతాబ్దంలో 1920, 1948, 1976లలో ఫిబ్రవరికి ఐదేసి ఆదివారాలు వచ్చాయి. ఈ శతాబ్దంలో 2004లో వస్తే 2032, 2060, 2098లలో తిరిగి రానున్నాయి. ప్రతి 28 ఏళ్లకీ ఇది రాక తప్పదన్నమాట.

## అచ్చయిన మొదటి పుస్తకం

జపాన్ రాణి మెబటోకు ఆదేశం ప్రకారం బుద్ధుని 10 లక్షల సూక్తుల్ని చైనాలో వాంగ్‌బీ అనే అతను కొయ్య పలకలతో బ్లాకులుగా తయారుచేసి అచ్చువేసాడుట. ఇదే ప్రపంచంలో అచ్చయిన మొదటి పుస్తకమంటారు.

-విమలారామం

